సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 12 । జనవరి । 2024



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సత్తా

ఉమ్మడి జిల్లాలోని ఏడు మున్సిపాలిటీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులను ప్రకటించాయి. 8లో



స'దూరం' క్యాంపులు..!

గతంలో ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో నిర్వహించిన సదరం శిబిరాలు ఇప్పుడు జిల్లా కేంద్రానికే పరిమితమయ్యాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
32° / 20°

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి పూట చలి ప్రభావం పెరిగే అవకాశం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



రామాలయంలో పీఓ దంపతులు

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున ఆలయంలో సుప్రభాతం, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు జరిపించారు. ఆ తర్వాత స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం గావించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ ధారణ, యోక్త్రధారణ చేశారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

రామయ్యను దర్శించుకున్న పీఓ..

శ్రీ సీతారామచంద్రస్వామివారిని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ప్రధానాలయంలో ప్రత్యేక పూజల అనంతరం అనుబంధ ఆలయాలను దర్శించుకున్నారు. అర్చకులు వారికి వేదాశీర్వచనం, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం పర్ణశాల రామయ్యను కూడా పీఓ దంపతులు దర్శించుకున్నారు.

ఏఎన్‌ఎంలకు ట్యాబ్‌ల పంపిణీ



ఏఎన్‌ఎంలకు ట్యాబ్‌లు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష

కొత్తగూడెంరూరల్ : జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో రెగ్యులర్ ఏఎన్‌ఎంలకు 102 ట్యాబ్‌లను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శిరీష గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చే ట్యాబ్‌లను సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా పేపర్ వర్క్ తగ్గుతుందని, సకాలంలో నివేదికలు నమోదు చేసే అవకాశం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత, ఎండీ ఫైజ్‌మొయిద్దీన్, డీపీఓ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదుత్పత్తికి అంతరాయం ఎదురుకావొద్దు



కేటీపీఎస్‌లో పర్యటిస్తున్న డైరెక్టర్ లక్ష్మయ్య

పాల్వంచ: విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి అవాంతరాలు లేకుండా ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వర్తించాలని టీఎస్ జెన్‌కో డైరెక్టర్(థర్మల్) బి.లక్ష్మయ్య సూచించారు. పాల్వంచలోని వెయ్యి మెగావాట్ల సామర్థ్యం కలిగిన కేటీపీఎస్ 5, 6వ దశల కర్మాగారంతో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 7వ దశ కర్మాగారాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా బాయిలర్, మిల్స్, కోల్ ప్లాంట్, ట్రిప్పర్ ఏరియా, యూసీబీల్లో పరిశీలించి విద్యుత్ ఉత్పత్తికి తీసుకుంటున్న చర్యలపై సీఈలు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్‌రావుతో చర్చించారు. ఆతర్వాత అధికారులతో సమావేశమై సాంకేతిక అంశాలపై చర్చించారు. ఎస్ఈలు వి.వెంకటేశ్వర్లు, టి.సత్యనారాయణ, జీ.వీ.ధర్మారావు, పి.కృష్ణ, బి.మోక్షవీర్, డీవైసీసీఏ పి.రామారావు, ఎస్‌పీఎఫ్ ఆర్ఐ రత్నారావు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఉట్నూరులోనైనా ఉత్తమ ఫలితాలు సాధించండి

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచరూరల్ : ఉట్నూరులో జరగనున్న సొసైటీ క్రీడోత్సవాల్లో అయినా జిల్లాకు చెందిన ఐటీడీఏ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటేలా చూడాలని పీఓ ప్రతీక్‌జైన్ స్పోర్ట్స్ అధికారులను ఆదేశించారు. ఇటీవల కిన్నెరసానిలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడోత్సవాల్లో జిల్లా విద్యార్థుల వెనుకబాటుపై 'పర్యవేక్షణ లేకనే' శీర్షికతో గురువారం 'సాక్షి'లో వచ్చిన కథనానికి పీఓ స్పందించారు. ఈ మేరకు క్రీడాధికారులతో సమీక్షించారు. మూడుసార్లు చాంపియన్లుగా గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలో వెనుకబాటుకు గల కారణాలపై చర్చించారు. ఖాళీగా ఉన్న కోచ్ పోస్టులను డిప్యూటేషన్లపై భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశించారు. ఈనెల 17 నుంచి ఉట్నూరులో జరిగే సొసైటీ క్రీడాపోటీల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో డీడీ మణెమ్మ, స్పోర్ట్స్ అధికారి బి.గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కదులుతున్నపీఠం



ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయం

డీసీసీబీ చైర్మన్ కూరాకులకు పదవీ గండం!

- వీ.వీ.పాలెం సొసైటీ చైర్మన్‌గా ఆయనపై అవిశ్వాసం
- అక్కడ చైర్మన్‌గిరీ కోల్పోతే డీసీసీబీ పదవి నుంచి తొలగింపు
- చైర్మన్ కుర్చీ కోసం పలువురి యత్నాలు



డీసీఓకు నోటీసు అందిస్తున్న వీ.వీ.పాలెం పీఏసీఎస్ డైరెక్టర్లు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) చైర్మన్ కూరాకుల నాగభూషణం పదవికి ముప్పు ఏర్పడింది. ఆయన చైర్మన్‌గా ఎన్నికైన రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం పీఏసీఎస్ డైరెక్టర్లు అవిశ్వాస తీర్మాన నోటీసును గురువారం డీసీఓకు అందజేశారు. మెజార్టీ డైరెక్టర్లు అవిశ్వాసం కోరిన నేపథ్యాన నిబంధనల మేరకు అధికారులు పదిహేను రోజుల్లోగా సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. ఆ సమావేశంలో అవిశ్వాస తీర్మానం నెగ్గితే కూరాకుల పీఏసీఎస్ చైర్మన్‌తో పాటు డీసీసీబీ చైర్మన్ పదవినీ కోల్పోనున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధికారం కోల్పోగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయాన 2020 ఫిబ్రవరి 15న జరిగిన సహకార సంఘం ఎన్నికల్లో వీ.వీ.పాలెం సొసైటీ చైర్మన్‌గా నాగభూషణం ఎన్నికయ్యారు. డీసీసీబీ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో విస్తరించి ఉండగా, వంద మంది పీఏసీఎస్ చైర్మన్లు డీసీసీబీ పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ పాలకవర్గానికి మరో 14 నెలల సమయం ఉండగా.. చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమైంది.

అవిశ్వాసానికి నోటీసు

వీ.వీ.పాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా ఉన్న కూరాకుల నాగభూషణంపై సంఘం డైరెక్టర్లు తిరుగుబావుటా ఎగురవేశారు. సంఘంలోని 13 మందికి గాను 11 మంది డైరెక్టర్లు నాగభూషణంపై అవిశ్వాసం ప్రకటిస్తూ గురువారం జిల్లా సహకార అధికారి(డీసీఓ) విజయకుమారికి నోటీసు అందజేశారు. దీంతో ఆమె పదిహేను రోజుల వ్యవధిలో సమావేశం నిర్వహించి డైరెక్టర్ల అభిప్రాయాలు తెలుసుకుంటామని వెల్లడించారు. అవసరమైతే తిరిగి ఎన్నిక నిర్వహిస్తామని.. మూడింట రెండొంతుల మెజార్టీ ఉన్న వారికి చైర్మన్ పదవి దక్కుతుందని తెలిపారు.

ఆ పదవి పోతే ఈ పదవి కూడా..

రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం సొసైటీ చైర్మన్ పదవిని నాగభూషణం కోల్పోతే డీసీసీబీ చైర్మన్ పదవి నుంచి తొలగిస్తారు. అనంతరం వైస్ చైర్మన్‌కు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించి నిర్ణీత వ్యవధిలో నూతన చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుంది. కాగా, ప్రస్తుత వైస్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు బీఆర్‌ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నారు.

20 మందిలో 18 మంది డైరెక్టర్లు..

డీసీసీబీ చైర్మన్ పదవి దక్కించుకునేందుకు పలువురు తెరచాటున యత్నాలు చేస్తున్నట్లు సమాచారం. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యాన పాలకవర్గంలో మార్పులు చోటుచేసుకునే అవకాశముంది. డీసీసీబీకి 20 మంది డైరెక్టర్లు ఉండగా వీరిలో పీఏసీఎస్‌ల చైర్మన్లు 16 మంది, వ్యవసాయేతర సంఘాలకు చెందిన నలుగురు డైరెక్టర్లుగా ఉన్నారు. అయితే ఇందులో ఒక ఎస్టీ డైరెక్టర్ పదవి ఖాళీగా ఉండగా, ఇటీవలే ముదిగొండ సొసైటీకి చెందిన డైరెక్టర్ వేముల శ్రీనివాస్ కన్నుమూశారు. దీంతో మిగిలిన డైరెక్టర్లలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకునే అవకాశముంది. ఇందులో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలే కాక జనసేన, సీపీఎంకు చెందిన వారూ ఉన్నారు.

నాడు ఏకగ్రీవం.. నేడు అవిశ్వాసం

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెం సహకార సంఘం చైర్మన్‌గా ఎన్నికైన కూరాకుల నాగభూషణం డీసీసీబీ చైర్మన్ పదవి దక్కించుకోవడం ప్రాముఖ్యత చాటుకుంది. 2020లో జరిగిన ఎన్నికల సమయాన నాగభూషణాన్ని డీసీసీబీ చైర్మన్‌ను చేయాలనే భావనతో వీ.వీ.పాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పుడు అదే చైర్మన్‌పై వైస్ చైర్మన్ రావెళ్ల శ్రీనివాసరావుతో పాటు మొత్తం 11 మంది డైరెక్టర్లు గురువారం డీసీఓ విజయకుమారికి అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. చైర్మన్‌తో పాటు మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా, 11 మంది నోటీసుపై సంతకాలు చేశారు. నోటీసు ఇచ్చిన వారిలో డైరెక్టర్లు రావూరి సైదుబాబు, గుండె ఆదినారాయణ, ఎం.నాగేశ్వరరావు, టి.భాస్‌సింగ్, జె.అనిత, బి.వెంకన్న, జి.ముత్తిలింగం, గుడ్ల సుగుణ, రావెళ్ల శ్రీనివాసరావు, రామారావు, సీహెచ్.మురళీకృష్ణ ఉన్నారు. డీసీఓను కలిశాక వారు విలేకరులతో మాట్లాడుతూ సంఘం అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం చైర్మన్‌గా ఏకగ్రీవంగా గెలిపించుకుంటే డైరెక్టర్లుగా తమకు ఎలాంటి గుర్తింపు, సమాచారం లేకుండా పనులు చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పుచ్చకాయల వీరభద్రం, చావా నారాయణరావు, పొట్ల వీరేందర్, యరగర్ల హన్మంతరావు, కమర్తపు మురళి, నెల్లూరి కోటేశ్వరరావు, చంద్ర రాంబాబు, గుర్రం జగన్, ఆనంద్, తమ్మిన్ని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తుళ్లూరి బ్రహ్మయ్యకు చాన్స్?

అశ్వాపురం పీఏసీఎస్ చైర్మన్‌గా పనిచేస్తూ డీసీసీబీ పాలకవర్గంలో డైరెక్టర్‌గా ఉన్న తుళ్లూరి బ్రహ్మయ్యకు డీసీసీబీ చైర్మన్ పదవి దక్కే అవకాశముందనే చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ అధిష్టానం బ్రహ్మయ్యకు ప్రాధాన్యత ఇవ్వడమే కాక మరికొందరి పేర్లను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. బీఆర్‌ఎస్‌లో ఉన్న బ్రహ్మయ్య ఏడాది క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2020లో కూరాకులను డీసీసీబీ చైర్మన్‌గా నియమించిన సమయాన బ్రహ్మయ్య పేరు కూడా వినిపించింది. ప్రస్తుతం మారిన రాజకీయ పరిణామాల క్రమంలో చైర్మన్‌గా బ్రహ్మయ్య పేరును అధిష్టానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, కూరాకుల ప్రాతినిధ్యం వహిస్తున్న వీ.వీ.పాలెం సహకార సంఘానికే తిరిగి చైర్మన్ పదవి కట్టబెడతారనే చర్చ కూడా సాగుతోంది.

సీతారామ పూర్తి చేయడమే నా లక్ష్యం



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన ఎమ్మెల్యేలు రాగమయి, ఆదినారాయణ

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- యాతాలకుంట టన్నెల్ పరిశీలన, అధికారులతో సమీక్ష
- ఏడాదిలోగా పూర్తి చేయాలని ఆదేశం
- రూ.70 కోట్లు ఇవ్వాలని భట్టికి విజ్ఞప్తి

సత్తుపల్లి: ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలంగా మార్చే సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయడమే తన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈమేరకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట టన్నెల్‌లో జరుగుతున్న పనులను సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి, జారె ఆదినారాయణతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. నెలకు వంద మీటర్ల పనులు జరుగుతున్నందున ఏడాదికల్లా పూర్తవుతుందని అధికారులు తెలిపారు. అయితే, రెండువైపుల నుంచి టన్నెల్ పనులు చేస్తూ వేగం పెంచాలని మంత్రి సూచించారు. సాంకేతిక, ఆర్థిక సమస్యలు ఉంటే సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి నిధులు ఇప్పిస్తానని తెలిపారు. జూన్ కల్లా స్ట్రక్చర్ పనులు పూర్తి చేసేలా యంత్రాంగం సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

టన్నెల్ పూర్తయితే...

యాతాలకుంట టన్నెల్ నిర్మాణం పూర్తయితే బేతుపల్లి చెరువులో గోదావరిజలాలు పారుతాయని.. సత్తుపల్లి, వేంసూరు మండలాలకు సాగునీటి ఇక్కట్లు తీరడమే కాక లంకాసాగర్‌కు సాగునీరు విడుదల చేయొచ్చని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సీతారామ ప్రాజెక్టు కాల్వ పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించిన మంత్రి ఆతర్వాత విలేకరులతో మాట్లాడారు. బూర్గంపాడు, పూసుగూడెం, కమలాపురం పంపుహౌస్‌ల నిర్మాణం పూర్తయిందని, గండుగులపల్లి పంపుహౌస్ నిర్మాణ దశలో ఉందని తెలిపారు. ఇది కూడా పూర్తయితే దమ్మపేట, అశ్వారావుపేట మండలాలకు సాగునీరు సరఫరా అవుతుందని వెల్లడించారు.

డిప్యూటీ సీఎం భట్టికి ఫోన్

యాతాలకుంట టన్నెల్ నిర్మాణ పనులకు భూసేకరణ అడ్డంకిగా ఉన్నందున తక్షణమే రూ.70 కోట్లు మంజూరయ్యేలా చూడాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను ఫోన్‌లో తుమ్మల కోరారు. ఈ టన్నెల్ పూర్తయితే మధిర బ్రాంచ్ కెనాల్ పరిధిలో వచ్చే ఏడాదికల్లా లక్ష ఎకరాలకు నీరు ఇవ్వొచ్చని వివరించారు. సంక్రాంతి లోపు భూసేకరణ సమస్య పరిష్కరించాలని కోరగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, సీతారామ ప్రాజెక్టు ఎస్ఈ ఎస్.శ్రీనివాసరెడ్డి, ఈఈలు కె.సురేష్‌కుమార్, శ్రీనివాసాచారి, అధికారులు డి.చంద్రశేఖర్, జి.మోతీలాల్, ఎల్.కృష్ణ, పి.చంద్రస్వామి, నర్సింహారావు, గఫూర్, కృష్ణ, సాగర్ పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

కొత్తగూడెంటౌన్: మానవ అక్రమ రవాణా (హ్యూమన్ ట్రాఫికింగ్)పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీడీపీఓ స్వర్ణలత లెనినా, ప్రజ్వల సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ్ కృష్ణ అన్నారు. మానవ అక్రమ రవాణాపై స్థానిక డీఆర్డీఏ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండు రోజుల పాటు నిర్వహించిన అవగాహన సదస్సు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు నేర్చుకున్న అంశాలను సమాజంలో అమలు చేయాలని అన్నారు. మానవ అక్రమ రవాణాపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని చెప్పారు. అనుమానితులను గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పద్మశ్రీ సునీతకృష్ణన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్, పోలీసు, న్యాయ శాఖల సమన్వయంతో ఇప్పటివరకు 28వేల మందిని కాపాడి పునరావాసం కల్పించారని వివరించారు. కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్ సురేష్‌కుమార్, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ ఆంబర్‌సింగ్, సూపర్‌వైజర్లు సీతామంగమ్మ, శారద, చంద్రకళ, భవాని, ఉమాదేవి, సుమతీదేవి, దేవేంద్రమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

- పట్టభద్రులకు ఫిబ్రవరి 6 తుది గడువు
- కలెక్టర్ ప్రియాంక ఆల వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గానికి జరగనున్న ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి ఓటు నమోదుకు పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటరు నమోదు దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారంలో ఈసీ నిబంధనలు పాటించాలని అధికారులకు సూచించారు. ఓటరు నమోదుపై సహాయ రిటర్నింగ్ అధికారులు, డిజిగ్నేటెడ్ అధికారులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతీ వారం నియోజకవర్గాల వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఓటరు జాబితాను రూపొందించాలని చెప్పారు. అర్హులైన పట్టభద్రులు ఫారం-18లో ఫిబ్రవరి 6వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఫిబ్రవరి 24న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని, మార్చి 14 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. వాటిని మార్చి 29 వరకు పరిష్కరించి ఏప్రిల్ 4న తుది జాబితా ప్రకటిస్తామని వివరించారు. 2020 నవంబర్ 2వ తేదీ నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేసిన వారు దరఖాస్తుకు అర్హులని పేర్కొన్నారు. డిజిగ్నేటెడ్ అధికారి లేదా గెజిటెడ్ అధికారుల ధ్రువీకరణతో దరఖాస్తు చేయాలని వివరించారు. చిరునామా కోసం ఓటరు నమోదు ఫారంతో పాటు ఎపిక్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను జతపర్చాలన్నారు. నూతన ఓటరు జాబితా తయారు చేస్తున్నందున గతంలో ఓటుహక్కు ఉన్న పట్టభద్రులు సైతం తిరిగి దరఖాస్తు చేయాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, డీఆర్‌ఓ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మిల్లింగ్ ప్రక్రియ నెలాఖరుకు పూర్తి చేయాలి

ఈ నెలాఖరు వరకు సీఎంఆర్ మిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ ప్రియాంక అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మిల్లర్లకు కేటాయించిన లక్ష్యం మేరకు సీఎంఆర్ మిల్లింగ్ పూర్తి చేయాలని, ఈ మేరకు అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న మిల్లర్ల నుంచి త్వరితగతిన మిల్లింగ్ పూర్తి చేయడానికి ఇతర మిల్లులకు కేటాయించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఎస్‌ఓ రుక్మిణీదేవి, డీఎం త్రినాథ్‌బాబు, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జుగల్ కిషోర్, కార్యదర్శి రాజేందర్, కోశాధికారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నీతి ఆయోగ్ మిషన్ డైరెక్టర్ వి.రాధ ఢిల్లీ నుంచి నిర్వహించిన వీసీలో కలెక్టర్ మాట్లాడుతూ.. యాస్పిరేషన్ డిస్ట్రిక్ట్ బ్లాక్స్ ప్రోగ్రామ్ కింద జిల్లాకు రూ. 4కోట్లు మంజూరయ్యాయని, నిధుల వినియోగంపై ద్రవ్య వినిమయ ధ్రువీకరణ పత్రాలు కూడా పంపించామని తెలిపారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి



కార్మికుల పిల్లలను ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఉద్యోగం పొందిన వారు రక్షణ సూత్రాలు పాటిస్తూ అంకితభావంతో విధులు నిర్వర్తించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ఏజీఎం పర్సనల్(వెల్ఫేర్) కోడూరి శ్రీనివాసరావు సూచించారు. సింగరేణి కార్పొరేట్ ఏరియాలో మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల పిల్లలకు కొత్తగూడెంలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ మెడికల్ పరీక్షలు పూర్తయ్యాక ఉద్యోగ నియామకాలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు విక్టర్ వందనం, రాజశేఖర్, సునీల్‌కుమార్, ఎస్.నరేంద్రకుమార్, రవికుమార్, శైలజ, స్వప్నిల్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ఆన్‌లైన్ పూర్తి !



చుంచుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తున్న ఆపరేటర్లు

- శరవేగంగా ప్రజాపాలన అర్జీల నమోదు
- గురువారం నాటికి 94.41 శాతం కంప్యూటరీకరణ
- మిగిలినవి 18,642 దరఖాస్తులే..

చుంచుపల్లి: జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. గత శనివారం నుంచి కంప్యూటరీకరణ చేస్తుండగా గురువారం నాటికి 94.41 శాతం మేర పూర్తయింది. జిల్లాలో ప్రజాపాలన గ్రామ సభల్లో భారీగా దరఖాస్తులు రావడంతో అధికారులు ఆన్‌లైన్‌ను సవాల్‌గా స్వీకరించారు. ఈ ప్రక్రియ వేగవంతానికి 550 మంది కంప్యూటర్ ఆపరేటర్లను నియమించడంతో పాటు వారికి సమగ్ర అవగాహన కల్పించారు. అధికారులు వారికి షిఫ్టులవారీగా విధులు కేటాయించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈనెల 17 వరకు దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తి చేయాల్సి ఉంది. అయితే జిల్లా అధికారులు చేపట్టిన ప్రణాళికలతో ఆ ప్రక్రియ శుక్రవారం నాటికే ముగిసే అవకాశం ఉంది.


94.41 శాతం ఆన్‌లైన్ పూర్తి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వీటిని వేగవంతం చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ప్రజాపాలన పేరుతో గత నెల 28 నుంచి ఈనెల 6 వరకు గ్రామసభల ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలోని 481 గ్రామ పంచాయతీలు, 104 మున్సిపల్ వార్డుల పరిధిలో భారీగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో అధికారులు ప్రత్యేక కంప్యూటర్ ఆపరేటర్లను నియమించి దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించగా కంప్యూటర్ ఆపరేటర్లు తమకు వచ్చే ఓటీపీ ద్వారా ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు పొందుపరుస్తున్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి కాగానే దరఖాస్తుకు ప్రత్యేక కోడింగ్ నంబర్ వేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 94.41 శాతం ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయింది.

మొత్తం 3,33,225 దరఖాస్తులు..

ప్రజాపాలన గ్రామసభల ద్వారా జిల్లాలో 3,33,225 దరఖాస్తులు అందాయి. అందులో ఇప్పటివరకు 3,14,583 దరఖాస్తులు ఆన్‌లైన్ చేశారు. ఇంకా 18,642 దరఖాస్తులను పొందుపర్చాల్సి ఉంది. వీటిలో 22 మండలాల పరిధిలో 2,75,402 దరఖాస్తులు రాగా, 2,60,001 దరఖాస్తులకు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయింది. ఇంకా 15,401 దరఖాస్తులను నమోదు చేయాల్సి ఉంది. జిల్లాలో అశ్వారావుపేట మండలంలో అత్యధికంగా 19,913 దరఖాస్తులు రాగా, అత్యల్పంగా ఆళ్లపల్లి మండలంలో 3,987 దరఖాస్తులు వచ్చాయి. అటు మున్సిపాలిటీల పరిధిలో కొత్తగూడెంలో అత్యధికంగా 20,529 దరఖాస్తులు అందాయి. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తికాగానే ఈనెల చివరి వరకు దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది.

ఈ రోజుతో ముగుస్తుంది



జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ శరవేగంగా నడుస్తోంది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. కంప్యూటర్ ఆపరేటర్లు ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందుకు పర్యవేక్షణ కోసం మండలాల వారీగా బృందాలను ఏర్పాటు చేశాం. ఇప్పటివరకు జిల్లాలో 94.41 శాతం నమోదు పూర్తయింది. మిగిలినవి శుక్రవారం పూర్తి కానున్నాయి. – జి.మధుసూదన్‌రాజు, డీఆర్డీఓ

మండలం	వచ్చిన దరఖాస్తులు	ఆన్‌లైన్ చేసినవి
భద్రాచలం	12,761	12,761
అశ్వాపురం	12,601	12,601
మణుగూరు	11,235	11,235
కరకగూడెం	5,349	5,349
అన్నపురెడ్డిపల్లి	7,161	7,102
చండ్రుగొండ	10,189	10,189
టేకులపల్లి	16,816	16,662
దమ్మపేట	19,351	19,099
పాల్వంచ	11,830	11,629
లక్ష్మీదేవిపల్లి	12,634	12,323
సుజాతనగర్	9,877	9,628
బూర్గంపాడు	18,811	18,299
ములకలపల్లి	12,867	12,478
ఇల్లెందు	18,770	17,878
గుండాల	5,654	5,276
జూలూరుపాడు	11,852	10,926
చుంచుపల్లి	11,866	10,702
పినపాక	11,330	10,191
దుమ్ముగూడెం	16,308	14,278
ఆళ్లపల్లి	3,987	3,419
అశ్వారావుపేట	19,913	16,367
చర్ల	14,299	11,609
మున్సిపాలిటీల్లో...		
మణుగూరు	8,102	8,102
పాల్వంచ	18,819	18,456
కొత్తగూడెం	20,529	19,463
ఇల్లెందు	10,373	8,561

క్లుప్తంగా

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి బంగారు ఆభరణం సమర్పిస్తున్న దాత

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం–జగన్నాధపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి 108 సువర్ణ పుష్పార్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, ఈఓ రజినీకుమారి, సభ్యులు చందుపట్ల శ్రీనివాస రెడ్డి, గంధం వెంగళరావు, సంకా వెంకటరామారావు, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

అమ్మ వారికి బంగారుహారం...

పెద్దమ్మతల్లి అమ్మ వారికి ఏపీలోని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఆనపు పెద్దబాబు రూ.4.50లక్షల విలువైన 76 గ్రాముల బంగారు హారాన్ని అమ్మవారికి సమర్పించారు. అలాగే, ఆలయ పునర్నిర్మాణానికి బూర్గంపాడు మండలం ఇరువెండికి చెందిన తాళ్లూరి జయశేఖర్–నీలిమ దంపతులు రూ.1,50,501 విరాళం అందజేశారు.

కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్‌ఐ సౌకర్యం



కాంట్రాక్ట్ కార్మికుల వివరాలు సేకరిస్తున్న ఈఎస్‌ఐ అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్‌ఐ సౌకర్యాలు వర్తింపజేసేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ ఈఎస్‌ఐ రీజియన్ అధికారి టి. ప్రశాంత్, వరంగల్ బ్రాంచ్ మేనేజర్ జి. సాయిలు తదితరులు గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయానికి వచ్చారు. డీజీఎం వరప్రసాద్, ఇతర అధికారులతో మాట్లాడి కాంట్రాక్ట్ కార్మికుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈఎస్‌ఐ సౌకర్యాలను వీలైనంత త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కాగా కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్‌ఐ వర్తింపు సీఐటీయూ కృషి ఫలితమేనని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం నాయకులు మధు, డి.వీరన్న తెలిపారు.

తిరుపతి నుంచి అయోధ్యకు పాదయాత్ర

దుమ్ముగూడెం : తిరుపతి నుంచి అయోధ్య రామ మందిరానికి సంతోష్ అనే భక్తుడు చేపట్టిన పాదయాత్ర గురువారం దుమ్ముగూడెం మండలం సర్సాపురంలోని ద్వాదశ జ్యోతిర్లింగ చిన్న అరుణాచలక్షేత్రానికి చేరుకుంది. డిసెంబర్ 28న ప్రారంభమైన తన పాదయాత్ర జనవరి 30 నాటికి అయోధ్యకు చేరుకుంటుందని సంతోష్ తెలిపాడు. కాగా, పాదయాత్ర విజయవంతంగా సాగాలని చిన్న అరుణాచలేశ్వర ఆలయ వ్యవస్థాపకులు శివనాగస్వామి ఆకాంక్షించారు.

డైరీల ఆవిష్కరణ



డైరీలు ఆవిష్కరిస్తున్న డీఈఓ తదితరులు

కొత్తగూడెంఅర్బన్: మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన డైరీలను డీఈఓ వెంకటేశ్వరాచారి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024లో వంట కార్మికులు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్, కార్యదర్శి విజయలక్ష్మి, సభ్యులు ప్రభావతి, మంగ, లక్ష్మి, రిటైర్డ్ ఏఈ కొండం వెంకన్న పాల్గొన్నారు.

ప్రేమించి మోసం చేశాడని యువతి ఫిర్యాదు

పాల్వంచరూరల్: ఓ యువకుడు తనను ప్రేమించి, పెళ్లికి నిరాకరిస్తున్నాడని యువతి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధిత యువతి కథనం ప్రకారం.. ఉల్వనూరు బంజర గ్రామానికి చెందిన యువతి, చర్ల మండలం కలివేరు ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన యాసం రవీందర్ అనే యువకుడు ఏడాది కాలంగా ప్రేమించుకుంటున్నారు. రవీందర్ పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. పెళ్లికి నిరాకరించడంతో యువతి పోలీసులను ఆశ్రయించింది. సదరు యువకుడితో తన వివాహం జరిపించాలని ఫిర్యాదు చేసింది. ఈ విషయమై ఎస్‌ఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. పిలిపించి విచారించగా యువకుడు వివాహానికి అంగీకరించాడని తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,448

సదూరం క్యాంపులు..!

ఎవరికీ పట్టని దివ్యాంగుల వేదన

- జిల్లా కేంద్రంలోనే సదరం శిబిరాల నిర్వహణ
- గ్రామాల నుంచి రాకపోకలకు తప్పని వ్యయప్రయాసలు
- స్థానికంగానే నిర్వహించాలని కలెక్టర్‌కు వేడుకోలు



సదరం క్యాంపు (ఫైల్)

భద్రాచలం: గతంలో డివిజన్ పరిధిలో ఉన్న ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీలలో సదరం క్యాంప్‌లు నిర్వహించే వారు. సెర్ప్ ఆధ్వర్యంలో ముందస్తుగా మండలాల జాబితాను విడుదల చేసి ఆయా గ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహించేవారు. తద్వారా డివిజన్ పరిధిలోని మండలాల దివ్యాంగులకు అనుకూలంగా ఉండేది. అయితే ఈ సదరన్ క్యాంపులను ఇటీవల కాలంలో జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రికి మార్చటంతో దివ్యాంగులకు ఇక్కట్లు ప్రారంభమయ్యాయి. ఉదాహరణకు చర్ల మండలం నుంచి కొత్తగూడెం రావాలంటే 120 కిలోమీటర్లు ప్రయాణించాలి. సుమారు మూడు గంటల సమయం పడుతుంది. అశ్వారావుపేట మండలం, పినపాక మండలాల నుంచి కూడా అదే పరిస్థితి నెలకొంది. ఇంత దూరం ప్రయాణించాలంటే దివ్యాంగులకు ఇబ్బందులు తప్పడంలేదు. వ్యయప్రయాసలకోర్చి క్యాంపులకు హాజరైనా.. సర్టిఫికెట్ కోసం పలుమార్లు తిరగాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో శారీరక, మానసిక బాధలతో పాటు ఆర్థికంగా కూడా అవస్థ పడుతున్నారు. జిల్లా కేంద్రంలో క్యాంపు నిర్వహిస్తుండటంతో రద్దీ పెరిగి, తీవ్ర జాప్యం కూడా నెలకొంటోంది.

కలెక్టర్ మేడమ్.. దృష్టి సారించరూ...!

- దివ్యాంగుల ఇక్కట్లపై కలెక్టర్ ప్రియాంక ఆల దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. స్థానికంగానే క్యాంపులు నిర్వహించి సర్టిఫికెట్లు ఇవ్వాలని పేర్కొంటున్నారు.
- జిల్లాలో కోవిడ్, ఇతర అనారోగ్య, వయోభారంతో మృతి చెందిన దివ్యాంగుల పేర్లను పింఛన్ జాబితా నుంచి తొలగించలేదనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా వందల సంఖ్యలోనే ఉన్నట్లు తెలుస్తోంది. సర్వే నిర్వహించి మృతుల పేర్లు తొలగించాల్సి ఉంది.
- ఆసరా పింఛన్ మంజూరులో వైకల్యం శాతాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. ఈ నేపథ్యంలో కొందరు అధికారులు, వైద్యులు లంచాలు పుచ్చుకుని అనర్హులకు వైకల్యం శాతం ఎక్కువగా ఉన్నట్లు ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.
- అర్హులకు సక్రమంగా సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ప్రభుత్వం నుంచి మూడు చక్రాల సైకిళ్లు, వాహనాలను పొందలేకపోతున్నారు. ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలను కూడా నష్టపోతున్నారు.
- ఇంటర్మీడియట్ విద్యార్హత ఉన్న వారికి మాత్రమే మోటార్ సైకిళ్ల పథకం అందజేస్తుండగా, అందరికీ వర్తింపచేయాలని కోరుతున్నారు.
- దివ్యాంగులకు ప్రతి మండలంలో డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని, ఆసరా పింఛన్‌కు ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని మినహాయించాలని విన్నవిస్తున్నారు.
- 35 కేజీల బియ్యం అందించే అంత్యోదయ కార్డును దివ్యాంగులందరికీ ఇవ్వాలి. ప్రైవేట్ సంస్థల్లోని ఉద్యోగ నియామకాల్లో ఐదు శాతం రిజర్వేషన్ కేటాయించి అమలుచేయాలి. స్వయం ఉపాధి పథకాలకు దివ్యాంగులను అనుమతించాలి.



ఈ చిత్రంలో కనిపిస్తున్న యువకుడి పేరు మేకల నాగేంద్రబాబు, వయసు 35 ఏళ్లు. దుమ్ముగూడెం మండలం పెద్ద నల్లబెల్లి గ్రామ నివాసి. పోలియో కారణంగా దివ్యాంగుడిగా మారాడు. ప్రభుత్వం అందచేస్తున్న ఆసరా పింఛన్ పొందేందుకు వైద్యుల ధ్రువీకరణ పత్రం కోసం కొత్తగూడెంలో నిర్వహిస్తున్న సదరం క్యాంపులకు ఇప్పటికే రెండుసార్లు వెళ్లాడు. అయినా సర్టిఫికెట్ రాలేదు. మరికొన్నిసార్లు సరైన సమాచారం అందక వెళ్లలేదు. దీంతో పెన్షన్ రాక బైక్ మెకానిక్ పనులు చేసుకుంటూనే జీవనం సాగిస్తున్నాడు. ప్రతిసారి దుమ్ముగూడెం నుంచి కొత్తగూడెం వెళ్లి రావాలంటే దూరాభారంతో పాటుగా చార్జీలకే డబ్బులు అవుతున్నాయని వాపోతున్నాడు.

క్యాంపునకు వెళ్లాలంటే తిప్పలే



నా కూతురు సుస్మిత దివ్యాంగురాలు. ఆమెకు వైద్యుల ధ్రువీకరణ పత్రం పొందేందుకు ఇప్పటికే పలుమార్లు కొత్తగూడెం వెళ్లివచ్చాం. ప్రతిసారి అంత దూరం నేను, నా కూతురు వెళ్లి రావాలంటే చాలా ఖర్చు అవుతోంది. చిన్న పిల్లలతో ఇబ్బందులు పడుతున్నాం. గతంలో స్థానికంగా పరీక్షించి సర్టిఫికెట్లు ఇచ్చినట్లుగా మళ్లీ ఇవ్వాలి. మా బాధలను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవాలి.

–బండి ప్రవీణ్, చర్ల మండలం

సమస్యలు పరిష్కరించాలి



జిల్లాలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. సదరం క్యాంపులను అన్ని చోట్ల నిర్వహించాలి. ఇతర సమస్యలపై కూడా కలెక్టర్ మేడమ్ ప్రత్యేక చొరవ తీసుకుని దారి చూపాలి. ఇప్పటికే ఎన్నో బాధలు పడుతున్నాం. ప్రభుత్వం అండ లేకపోతే ముందుకు సాగలేని పరిస్థితి మాది. మాపై కరుణ చూపి ఆదుకోవాలి.

–అన్నెం సత్తిబాబు, భద్రాద్రి వెల్ఫేర్ హ్యాండిక్యాప్డ్ సొసైటీ జిల్లా సెక్రటరీ

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సత్తా

- మెరుగుపడిన కేఎంసీ ర్యాంక్
- జాతీయ ర్యాంక్ 141, రాష్ట్రస్థాయిలో 7
- మున్సిపాలిటీల ర్యాంకులు మాత్రం కిందకు...

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకులను ప్రకటించాయి. 2023 ఏడాదికి గాను ప్రకటించిన ర్యాంకుల్లో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ స్థానం మెరుగపడింది. జాతీయ స్థాయిలో 141, రాష్ట్ర స్థాయిలో ఏడో ర్యాంక్ సాధించింది. ఆరు అంశాల్లో ప్రగతిని పరిశీలించి కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ర్యాంకులను కేటాయించారు. 2022 ఏడాదిలో కేఎంసీకి జాతీయ స్థాయిలో 155 ర్యాంకు రాగా ఈసారి మెరుగుపడి 141 స్థానంలో నిలిచింది. అదే ఏడాది రాష్ట్రంలో 12వ ర్యాంక్ సాధించగా.. ఈసారి 7వ ర్యాంక్ సాధించడం విశేషం. కేఎంసీ పరిధిలో ఇంటింట చెత్త సేకరణ 99 శాతం జరుగుతుండగా.. చెత్త సెగ్రిగేషన్ 99 శాతం, ప్రాసెసింగ్ 61 శాతం, నివాస ప్రాంతాలు, మార్కెట్ ప్రాంతాలు, పబ్లిక్ టాయిలెట్లలో 100 శాతం పరిశుభ్రతను పాటిస్తుండడంతో ర్యాంకులు మెరుగయ్యాయి.

పడిపోయిన మున్సిపాలిటీల ర్యాంకులు..

కార్పొరేషన్లతో పాటు మున్సిపాలిటీలకు సైతం ప్రభుత్వాలు స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులను ప్రకటించాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు మున్సిపాలిటీలకు ర్యాంకులను కేటాయించాయి. జాతీయ, జోనల్, స్టేట్ ర్యాంకులను కేటాయించగా.. 2022తో పోలిస్తే 2023లో అన్నింటి ర్యాంకులు పడిపోయాయి. కాగా, జోనల్ స్థాయిలో మాత్రం సత్తుపల్లి, ఇల్లెందు ర్యాంకులు కాస్త మెరుగయ్యాయి.

మున్సిపాలిటీలకు స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులు

మున్సిపాలిటీ	జాతీయ ర్యాంక్	జోనల్ ర్యాంక్		రాష్ట్ర ర్యాంక్	
	2023	2022	2023	2022	2023
మధిర	1,325	121	158	40	126
వైరా	3,062	187	256	41	131
సత్తుపల్లి	1,257	73	52	37	98
కొత్తగూడెం	1,060	35	43	25	75
పాల్వంచ	1,128	11	50	09	81
ఇల్లందు	537	18	11	16	20
మణుగూరు	2,280	52	153	34	124

గోల్డ్ అప్రైజర్‌పై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: నకిలీ బంగారం తాకట్టు పెట్టిన ఘటనలో గోల్డ్ అప్రైజర్‌పై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని చర్ల రోడ్డులో ఉన్న సెంట్రల్ బ్యాంక్‌లో రాజేష్ అనే వ్యక్తి 2015 నుంచి గోల్డ్ అప్రైజర్‌గా పనిచేస్తున్నాడు. గత నవంబర్ 24న అసిస్టెంట్ రీజనల్ మేనేజర్ శ్రీకాంత్, ఖమ్మం బ్రాంచ్ అప్రైజర్ నకిరికంటి రాధాకృష్ణ ఇక్కడి బ్రాంచిలో సాధారణ తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో 123 ప్యాకెట్లకు సంబంధించిన 62 మంది వినియోగదారుల బ్యాంక్ ఖాతాల్లో సుమారు రూ.75.42 లక్షల విలువైన నకిలీ బంగారం తాకట్టు పెట్టినట్లు తేలింది. ఈ వ్యవహారంపై బ్యాంక్ అధికారులు అంతర్గత విచారణ చేయగా, గోల్డ్ అప్రైజర్ రాజేశ్ ఉద్దేశపూర్వకంగా ఖాతాదారులను నమ్మించి చీటింగ్‌కు పాల్పడ్డాడని తేలింది. సెంట్రల్ బ్యాంక్ భద్రాచలం బ్రాంచ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్ ఫిర్యాదు మేరకు రాజేష్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పాల్వంచరూరల్ : ఓ యువకుడు గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన లేతవడ్ల ప్రవీణ్ ఆత్మహత్యకు యత్నిస్తుండగా ఇరుగుపొరుగు గమనించి పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేశాక మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తీసుకెళ్లారు.

టీపీజేఎంఏ కమిటీ ఎన్నిక

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శేషగిరి, జగదీష్



నూతన కమిటీని అభినందిస్తున్న రాష్ట్ర బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీజేఎంఏ) ఉమ్మడి జిల్లా కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎక్సలెంట్ కళాశాల కరస్పాండెంట్ చల్లా శేషగిరిరావు, కార్యదర్శిగా కృష్ణవేణి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ గొల్లపుడి జగదీష్ ఎన్నికయ్యారు. అలాగే, కోశాధికారిగా ఎస్.వీరభద్రం, ఈసీ–1, 2లుగా ఎం.వీరారెడ్డి, పి.ప్రవీణ్‌రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఈసీ–1 ఎం.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎం.అనిల్‌కుమార్, ఎం.దుర్గారావు, ఎం.మామంద్రరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా రాయల సతీష్‌బాబు, ఎం.నాగిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఎం.చైతన్య, ఎం.రవి ఎన్నికైనట్లు వెల్లడించారు. ఎన్నికకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.తిరుపతిరెడ్డి పరిశీలకులుగా హాజరు కాగా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్‌ను ఓడించిన కార్మికులకు జేజేలు

- మెడికల్ పైరవీకారు సీతారామయ్యను తరమాలి
- సీపీఐ మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

ఇల్లెందు: ఇటీవల జరిగిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మిక ద్రోహుల సంఘం టీబీజీకేఎస్‌ను చీల్చి చెండాడిన కార్మికులకు జేజేలని సీపీఐ మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్టు కమిటీ కార్యదర్శి ప్రభాత్ పేర్కొన్నారు. గురువారం ఆయన పేరుతో ఒక ప్రకటన విడుదలైంది. మెడికల్ బోర్డు పైరవీకారుడు వాసిరెడ్డి సీతారామయ్య, అతని అనుచరులను తరిమి వేయాలని, వసూళ్లకు పాల్పడే ఐఎన్‌టీయూసీ జనక్‌ప్రసాద్, అతని అనుచరులను నిలదీయాలని పేర్కొన్నారు. టీబీజీకేఎస్‌లోని కొందరు రూపం మార్చుకుని ఏఐటీయూసీలోకి, ఐఎన్‌టీయూసీలోకి వెళ్లి మళ్లీ దోపిడీలకు పాల్పడాలని చూస్తున్నట్లు తెలిపారు. వీరి అవకాశవాద కార్మిక విధానాలు తెలుసుకుని జాగ్రత్త పడే లోపే ఎన్నికల గందరగోళానికి గురి చేసి బూటకపు ఎన్నికల గోదాలోకి లాగారని తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సింగరేణి సంస్థను అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీగా మార్చే కుట్ర పూరితమైన చర్యలకు శ్రీకారం చుడుతోందని ఆరోపించారు. దేశభక్తి ముసుగులో దేశద్రోహానికి పాల్పడుతున్న మోదీ, అదానీ కబంధ హస్తాల నుంచి సింగరేణిని కాపాడుకునేందుకు, కొత్త గనులు సాధించుకునేందుకు కాంట్రాక్ట్ కార్మికుల పర్మనెంట్ కోసం సింగరేణి కార్మికులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ట్రాక్టర్ డ్రైవర్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

టేకులపల్లి: అటవీశాఖ అధికారులు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించి, వారి వాహనాన్ని ఢీకొట్టి ధ్వంసం చేసిన కేసులో బాధ్యుడైన ట్రాక్టర్ డ్రైవర్‌ను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు గత మంగళవారం తెల్లవారుజామున రోళ్లపాడు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ తేజావత్ రంగ్యా, కొమరారం ఎఫ్‌ఆర్‌ఓ ఉదయ్‌కుమార్, ఎఫ్‌బీవోలు గౌరమ్మ, శ్రీను, పాపయ్య తొమ్మిదోమైలుతండా సమీపంలోని సాయనపేట వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో టేకులపల్లి నుంచి ఇల్లెందు వైపు ట్రాక్టర్‌పై ఇసుక లోడుతో వస్తున్న లాలుతండాకు చెందిన సునావత్ హాతీరామ్‌ను ఫారెస్టు అధికారులు ఆపి ప్రశ్నించారు. తప్పించుకునే క్రమంలో హాతీరామ్ ట్రాక్టర్‌ను వేగంగా తీసుకెళ్లి ఫారెస్టు అధికారుల వాహనాన్ని ఢీకొట్టి పరారయ్యాడు. ఈ ఘటనలో అధికారులు, సిబ్బంది ప్రమాదం నుంచి బయటపడ్డారు. కారు ధ్వంసం కావడంతో రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. ఎఫ్‌ఎస్‌ఓ రంగ్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గురువారం నిందితుడు హాతీరామ్‌ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కిన్నెరసాని కాలువలో పడి వ్యక్తి మృతి

పాల్వంచరూరల్: కిన్నెరసాని నీటి కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన రెడ్డిగూడెం వద్ద చోటుచేసుకుంది. ఎస్‌ఐ.బి.శ్రీనివాస్ కథనం ప్రకారం... మండల పరిధిలోని రెడ్డిగూడెం ఎస్టీ కాలనీకి చెందిన సోడే ఐతయ్య(32)కొంతకాలంగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. బుధవారం సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకువెళ్లి తిరిగి ఇంటిరాలేదు. గురువారం కుటుంబసభ్యులు గాలిస్తుండగా కాలువలో పడి మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ హరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ ట్యాంకులో పడి..

కొత్తగూడెంటౌన్: ప్రమాదవశాత్తు వాటర్ ట్యాంకులో పడి కొత్తగూడెం చమాన్‌బస్తీకి చెందిన గండి రవి శ్రీనివాస్ (65) మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. సింగరేణి విశ్రాంత ఉద్యోగి రవి శ్రీనివాస్ చమాన్‌బస్తీలో నివాసం ఉంటున్నాడు. కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. రోజులాగే గురువారం కూడా ఇంటిముందుకు రాగా, ప్రమాదశాత్తు సమీపంలోని వాటర్ ట్యాంక్‌లో పడి మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసినట్లు కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని మర్రిగూడెం గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మామిడిగూడెం గ్రామపంచాయతీ సీతానగరం గ్రామానికి చెందిన వర్స నరేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్వగ్రామం నుంచి గుండాల వెళుతుండగా తాను ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 ద్వారా ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు నరేష్‌ను ఖమ్మం సిఫారసు చేశారు.

నాటుసారా తయారీదారుడికి జరిమానా

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల గ్రామ పంచాయతీ దుబ్బతండాకు చెందిన నాటుసారా తయారీదారుడు గుగులోత్ గోవింద్‌కు తహసీల్దార్ శారద రూ.75 వేలు జరిమానా విధించారు. నాటుసారా తయారు చేసి విక్రయిస్తుండగా పట్టుకుని బైండోవర్ చేశామని, అయినా మార్పు రాకపోవడంతో తహసీల్దార్ జరిమానా విధించారని కొత్తగూడెం ఎక్సైజ్ శాఖ సీఐ జయశ్రీ, ఎస్‌ఐ సాయి తెలిపారు.

ఐఈడీ నిర్వీర్యం

దుమ్ముగూడెం : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా చింతగుఫా పోలీస్‌స్టేషన్ పరిధిలోని దులేడ్ అటవీప్రాంతంలో భద్రతా బలగాలు గురువారం ఐఈడీని గుర్తించి నిర్వీర్యం చేశారు. అటవీప్రాంతంలో గాలింపునకు వచ్చే భద్రతా బలగాలను అంతమొందించేందుకు మావోయిస్టులు ఐఈడీలను అమర్చగా, గుర్తించి నిర్వీర్యం చేయడంతో పెనుప్రమాదం తప్పింది.

నిలిపిఉన్న కారులో గంజాయి

భద్రాచలంఅర్బన్: అనుమానాస్పదంగా నిలిపి ఉంచిన కారు నుంచి పోలీసులు గురువారం గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని సూపర్‌బజార్ సెంటర్‌లో కొంత కాలంగా ఓ కారు నిలిపి ఉంది. స్థానికులకు అనుమానం వచ్చి 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో స్థానిక పోలీసులు ఆ ప్రదేశానికి వెళ్లి, కారు డోర్ తీసేందుకు ప్రయత్నించగా అవి రాలేదు. దీంతో నకిలీ తాళంచెవి ద్వారా కార్ డోర్లను తెరిచి తనిఖీ చేయగా, 98 కేజీల గంజాయి లభించింది. కారును స్టేషన్‌కు తరలించి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.24.50 లక్షలు ఉంటుందని అంచనా. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

15 కేజీల గంజాయి స్వాధీనం



గంజాయి, నిందితులను చూపిస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలో గురువారం ఎక్సైజ్ అధికారులు 15 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారుల కథనం ప్రకారం.. పట్టణంలోని కూనవరం రోడ్‌లో అధికారులు వాహన తనిఖీల చేపట్టగా, రెండు ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 15 కేజీల గంజాయి లభించింది. ఒడిశాకు చెందిన టాంకొంధర్ ఖిల్లా, పటి ఖిల్లా అక్కడే గంజాయి కొని హైదరాబాద్ తరలిస్తూ పట్టుబడ్డారు. అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. భద్రాచలం ఎక్సైజ్ సీఐ రహీమున్నీషాబేగం, సిబ్బంది అక్రమ్, బాబు, లలిత, నరేందర్, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

టేకు కలప స్వాధీనం

ఇల్లెందురూరల్: అక్రమంగా తరలిస్తున్న రూ.2 లక్షల విలువైన టేకు కలపను గురువారం సుదిమళ్ల స్టేజీ వద్ద అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. అక్రమంగా రవాణా చేస్తున్న టేకు కలపను అడ్డుకునేందుకు ఇల్లెందు డివిజన్ పరిధిలోని అటవీశాఖ సిబ్బందిని మూడు బృందాలుగా గస్తీ నిర్వహించారు. ఈ క్రమంలో గుండాల మండలంలోని అటవీప్రాంతం నుంచి మర్రిగూడెం మీదుగా ఇల్లెందు వైపుగా వాహనంలో తరలిస్తుండగా వెంబడించి సుదిమళ్ల వద్ద పట్టుకున్నారు. కలపను ఇల్లెందు యా ర్డుకు తరలించామని, కలప విలువ రూ.2లక్షల వరకు ఉంటుందని ఎఫ్‌డీఓ కె.వెంకన్న తెలిపారు. గస్తీలో ఎఫ్‌ఆర్‌ఓలు నాగేశ్వరరావు, ఉదయ్, డీఆర్‌వోలు సాల్మన్‌రాజ్, రాంసింగ్, సిబ్బంది కళ్యాణ్ పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: భార్యను వేధిస్తున్న భర్తపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉండే రజినికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంతకల్లుకు చెందిన మిద్దె గోపాలకృష్ణతో 16 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కాగా కొంతకాలంగా గోపాల కృష్ణ మద్యానికి బానిసై భార్యను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయలక్ష్మి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామసమీపంలోని పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్సైలు రాజ్‌కుమార్, నాగభిక్షం సిబ్బందితో కలిసి దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మరో 13 మంది వ్యక్తులు పరారయ్యారు. వారిని కూడా అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తామని, ముగ్గురు వ్యక్తుల వద్ద రూ.4 వేల నగదు, నాలుగు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

పాల్వంచలో నలుగురు..

పాల్వంచరూరల్: పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడి చేశారు. ఎస్‌ఐ.శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని నాగారం గ్రామ సమీపంలో ఉన్న పాతక్రషర్‌మిల్లు వద్ద జామాయిల్‌తోటలో కొందరు పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి, నలుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.7,300 నగదు, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.